క్లుప్తంగా

పరిశుభ్రత పాటిస్తేనే ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న ఎంపీవో రత్నాకర్

ఖానాపూర్: పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని సేవ్యానాయక్ తండాలో పర్యటించారు. ఈసందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో సెగ్రిగేషన్ షెడ్డు, వైకుంఠధామం, పల్లె ప్రకృతివనం, నర్సరీని సందర్శించారు. పంచాయతీ కార్యాలయానికి వెళ్లి రికార్డులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఆలయానికి విరాళం



విరాళం అందిస్తున్న దాతలు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో రామాలయ నిర్మాణానికి బుధవారం కాలనీకే చెందిన లాండేరి భూలక్ష్మి–శంకర్ దంపతులు రూ.11 వేలను విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అల్లాడి వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు భీమేశ్వర్, జనార్దన్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి సాయం



సాయం అందిస్తున్న మోహన్‌రావు పటేల్

భైంసారూరల్: మండలంలోని సుంక్లి గ్రామానికి చెందిన ముత్యం ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతి చెందగా బాధిత కుటుంబానికి బుధవారం మోహన్‌రావు పటేల్ ప్రజా ట్రస్ట్ తరఫున చేయూతనిచ్చారు. ట్రస్ట్ చైర్మన్ మోహన్‌రావు పటేల్ బాధిత కుటుంబానికి రూ.10వేల నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. అధైర్యపడొద్దని.. అండగా ఉంటానని వారికి ఆయన భరోసానిచ్చారు. వారి వెంట మోహన్, సత్యానారాయణ, హరీశ్ తదితరులు ఉన్నారు.

ప్రోత్సాహకం అందజేత



బహుమతులు పొందిన వారితో గంగారెడ్డి

లక్ష్మణచాంద: మండలంలోని పీచర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇటీవల పదోతరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ముగ్గురికి అదే గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు గంగారెడ్డి బుధవారం ప్రోత్సాహక బహుమతులు అందించారు. విద్యార్థిని తిప్పని అనుష్కకు రూ.5వేలు, సొన్న వైష్ణవికి రూ.మూడు వేలు, నల్ల రాణికి రూ.రెండు వేలు అందించారు. హెచ్‌ఎం సాయికృష్ణ, సీఆర్పీ సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇటుకతో దాడి.. ఒకరిపై కేసు

తానూరు: మండలంలోని బోల్సా గ్రామానికి చెందిన కడిగోల్ల శంకర్‌పై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై భానుప్రసాద్ తెలిపారు. బోల్సా గ్రామంలో ఈనెల 17న మంగళవారం గట్బోల్ల గంగాధర్ ఇళ్లు నిర్మించుకునేందుకు ముగ్గు పోసుకున్నాడు. పక్కనే స్థలం కల్గిన కడిగోళ్ల శంకర్.. గంగాధర్‌ను అసభ్య పదజాలంతో దూషిస్తూ నా స్థలంలో ఎందుకు ముగ్గు పోస్తున్నావని గొడవకు దిగాడు. వారిని సముదాయించేందుకు గంగాధర్ తల్లి దేవుబాయి మధ్యలో వెళ్లింది. దీంతో శంకర్.. దేవుబాయి తలపై ఇటుకతో కొట్టడంతో గాయాలయ్యాయి. భైంసా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందిన బాధితురాలు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో శంకర్‌పై ఫిర్యాదు చేసినట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు



చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టర్ మతిన్

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో డాక్టర్ మతిన్ చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం చిన్నారుల, ఎత్తు బరువులను పరీక్షించారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఫార్మసిస్టులు గౌతమి, రమ, అంగన్‌వాడీ టీచర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

చెరువు అలుగు పట్టదా.?



మరమ్మతుకు నోచుకోని పాతవెంకూర్ చెరువు అలుగు



చెరువు నుంచి ఏర్పడిన కాలువ

కుంటాల: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ఇసుక మేటలు ఏర్పడకుండా కుంటాల మండలంలోని పాతవెంకూర్ సమీపంలో ఓలా వాగుపై 2006 సంవత్సరంలో రూ.కోటి 47 లక్షలతో చెరువు నిర్మించారు. 166 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు 1350 ఎకరాలకు సాగునీరు అందించాలి. కానీ చెరువు నిర్మించిన ఏడాదికే దీని అలుగుకు బుంగ ఏర్పడింది. మరమ్మతులు నిర్వహించినా.. 2008లో మళ్లీ కురిసిన భారీ వర్షాలకు అలుగు కొట్టుకుపోయింది. దీంతో చెరువులో కాలువ ఏర్పడి నీరంతా వృథాగా పోతుంది. అలుగు సమస్యను పరిష్కరించాలని ఏళ్లుగా పాలకులకు, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. ఈ చెరువులో నీరు ఉంటే ఓలా, విఠాపూర్, వెంకూర్, అందాకూర్ గ్రామాలకు సాగునీటి సమస్య తలెత్తదని.. ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు అలుగుకు మరమ్మతులు చేపట్టి సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

శిథిల భవనాలు కూల్చేయరూ..



భైంసారూరల్: మండలంలోని ఇలేగాం గ్రామంలో శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాల పాత భవనాలు కూల్చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఒకే ఆవరణలో పాఠశాల కొత్త భవనం, పాత భవనాలు ఉన్నాయి. విద్యార్థులు ఆడుకుంటూ శిథిల భవనాల వద్దకు వెళ్తే ముప్పు పొంచి ఉంది. అధికారులు స్పందించి రెండు పాత భవనాలను కూల్చివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పేదల సొంతింటి కల నెరవేరుస్తాం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఖానాపూర్: ఇల్లు లేని పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన 26 మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అధికారులతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందని గుర్తు చేశారు. అంతకుముందు స్థానిక కార్యాలయంలో అధికారులతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు.అనంతరం అంబేద్కర్‌నగర్ కాలనీలోని ముత్యాలపోచమ్మ ఆలయంలో పూజలు చేశారు. అంతకుముందు 11వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, నాయకులు ఎంఏ మాజిద్, చిన్నం సత్యం, దయానంద్, కావలి సంతోష్, నిమ్మల రమేష్, తదితరులు ఉన్నారు.



ప్రొసీడింగ్ కాపీలు అందిస్తున్న ఎమ్మెల్యే

డిగ్రీ కళాశాల, ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు వినతి

ఖానాపూర్: నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలతోపాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలని కోరుతూ పలువురు పట్టణవాసులు బుధవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని కుమురం భీం చౌరస్తాలో ఉన్న ప్రభుత్వ స్థలంలో డిగ్రీ, ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రణయ్, సాయి, రాజు, భూషణ్, రవీందర్, నవీన్, రాములు, రోహిత్, శ్రీధర్, రాజేశ్, అరుణ్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు బుధవారం నిర్మల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజేశ్వర్ భూమిపూజ చేశారు. నాయకులు లింగారెడ్డి, భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సారంగపూర్: మండలంలోని వైకుంఠాపూర్, రాంసింగ్‌తండా, పొట్యా తదితర గ్రామాల్లో సారంగపూర్ ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ముగ్గు పోశారు. ప్రభుత్వం విడతల వారీగా డబ్బులను ఖాతాల్లో జమ చేస్తుందని.. పనులు వేగంగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు చైర్మన్ సూచించారు. మండలాధ్యక్షుడు బొల్లోజి నర్సయ్య, కోర్వ నవీన్‌రెడ్డి, ఓలాత్రి నారాయణరెడ్డి, సత్యపాల్‌రెడ్డి, మైలి రాజేశ్వర్, ఏనుగు ముత్యంరెడ్డి, సుదర్శన్, చిన్నయ్య తదితరులు ఉన్నారు.

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామంలో బుధవారం నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీంరెడ్డి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ రాంరెడ్డి, నాయకులు లింగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గంగారెడ్డి, రఫీ, లింగన్న, శేఖర్, మనోహర్, సుదర్శన్, నర్సారెడ్డి ఉన్నారు.



మామడ: పొన్కల్‌లో భూమిపూజ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ భీంరెడ్డి, పక్కన నాయకులు

ఖానాపూర్: మండలంలోని ఎర్వచింతల్, బీర్నంది గ్రామాల్లో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. స్థానిక కాంగ్రెస్ నాయకులు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు.



లోకేశ్వరం : రాయపూర్‌కాండ్లీలో ముగ్గు పోస్తున్న హౌసింగ్ ఏఈ సవైరాం

కార్యక్రమంలో భిక్కునాయక్, కొడారి నరేశ్, బండారి రవీందర్, చిన్న రాజన్న, అంబాజీ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లోకేశ్వరం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నాణ్యతగా చేపట్టాలని హౌసింగ్ ఏఈ సవైరాం అన్నారు. బుధవారం మండలంలోని రాయపూర్‌కాండ్లీ, పిప్రి, పుస్పూర్ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోశారు. పంచాయతీ కార్యదర్శులు సంతోష్, రాములు, నారాయణ్ ఉన్నారు.

కార్యకర్తలూ.. పార్టీ అభ్యర్థులను గెలిపించాలి

కుభీర్: కార్యకర్తలు సమష్టిగా పని చేసి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. బుధవారం కుభీర్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీహరిరావు, మాజీ ఎమ్మెల్యేలు వేణుగోపాలచారి, నారాయణ్‌రావు పటేల్, విఠల్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు. గ్రామ, మండల, బ్లాక్ స్థాయిల్లో కమిటీల నియామకానికి చురుకైన నాయకుల పేర్లు ఇవ్వాలని.. అందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు ఉండేలా చూడాలన్నారు. స్థానికసంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీలుగా పోటీ చేసే అభ్యర్థుల కోసం పేర్లు పంపాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ మండలాధ్యక్షుడు బషీర్ ఆధ్వర్యంలో జరగగా జిల్లా పరిశీలకులు అవేశ్‌ఖాన్ హాజరయ్యారు. సమావేశంలో ఆత్మ చైర్మన్ వివేక్, మాజీ జెడ్పీటీసీ చవాన్ శంకర్, శంకర్ చంద్రే, నాయకులు బంక బాబు, కె.హన్మాండ్లు, దేవేందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంతోష్, విజయ్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

కుభీర్ ఏఎంసీ చైర్మన్‌గా కల్యాణ్

కుభీర్: కుభీర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) చైర్మన్‌గా మండలకేంద్రానికి చెందిన కల్యాణ్, వైస్ చైర్మన్‌గా గోడాపూర్‌కు చెందిన హైమద్‌ను ప్రభుత్వం నియమించింది. బుధవారం కుభీర్ ఏఎంసీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి సమక్షంలో కల్యాణ్ బాధ్యతలు స్వీకరించారు. పలువురు డైరెక్టర్లుగా నియమితులయ్యారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చవాన్ శంకర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ రాములు, మార్కెట్ ఏఎంసీ కార్యదర్శి రాజేశ్వర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంతోష్, నాయకులు పి.విజయ్, శంకర్, ఆనంద్, పెంటాజీ, రహూఫ్, రాజన్న తదితరులున్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న కల్యాణ్, పక్కన విఠల్‌రెడ్డి

లక్ష్మణచాంద టు కుభీర్ మండలం



దొడర్నాలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

- తండాల్లో బడిబాట నిర్వహించిన ఉపాధ్యాయులు
- 25 మందికి అడ్మిషన్లు

లక్ష్మణచాంద: సర్కారు బడుల్లో ప్రవేశాలు పెంచేందుకు బడిబాటలో భాగంగా బుధవారం లక్ష్మణచాంద జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజునాయక్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సుమారు 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుభీర్ మండలం దొడర్నాతండా పరిధిలోని ఐదు తండాలకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. వివరాల్లోకి వెళితే లక్ష్మణచాంద జెడ్పీ ఉన్నత పాఠశాలకు అనుబంధంగా ఉన్న బీసీ బాలుర వసతిగృహం ఉంది. ఇందులో ఉన్న విద్యార్థుల్లో సుమారు 35 మంది విద్యార్థులు ఈ తండాలకు చెందినవారే. గతంలో ఉన్న 35 విద్యార్థులను కలిసి పాఠశాలకు రావాలని కోరడంతోపాటు ఈసారి మరో 25మందికి వసతిగృహంలో, పాఠశాలలో ప్రవేశాలు కల్పించినట్లు హెచ్‌ఎం రాజునాయక్ పేర్కొన్నారు. ఇందులో ఉపాధ్యాయులు హరిప్రసాద్, అశోక్, శ్రీనివాస్, శ్రీపాద్ తదితరులు ఉన్నారు.

నేడు నిర్మల్ ఎమ్మెల్యే రాక

నర్సాపూర్(జి): మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించేందుకు గురువారం మండలకేంద్రంలోని రైతువేదికకు నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి రానున్నట్లు బీజేపీ మండలాధ్యక్షుడు బర్కుంట నరేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి లబ్ధిదారులు, పార్టీ నాయకులు, అధికారులు సకాలంలో రావాలని సూచించారు.

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని రైతువేదికకు గురువారం సాయంత్రం నాలుగు గంటలకు ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి రానున్నట్లు బీజేపీ నాయకులు అడ్వాల రమేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందిస్తారని పేర్కొన్నారు. నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

క్రీడాపాఠశాలల్లో ప్రవేశానికి రేపు ఎంపిక పోటీలు

సారంగపూర్: క్రీడాపాఠశాలల్లో ప్రవేశం కోసం మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 20న విద్యార్థులకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామని ఎంఈఓ మధుసూదన్ తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్ ఫారం, నేరుగా వచ్చే విద్యార్థులు(దరఖాస్తు చేయనివారు) తమ విద్యార్హత ధ్రువపత్రాలతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని ఆయన సూచించారు.

రెండు రోజులుగా రోడ్డుపైనే లారీ



ఇరుకురోడ్డుపై నిలిచిన లారీ

ఖానాపూర్: పట్టణంలో లారీల అడ్డా సమీపంలో సిమెంట్ బస్తాలతో వెళ్తున్న ఓ లారీ బ్రేక్ డౌన్ కారణంగా మంగళవారం రోడ్డుపైనే అర్ధాంతరంగా నిలిచిపోయింది. ఇప్పటికే రోడ్డు వైడెనింగ్ పనులతో వాహనదారులు, ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం లారీ కూడా రోడ్డుపైనే నిలుపడంతో వీరి అవస్థలు రెట్టింపయ్యాయి. అధికారులు స్పందించి రోడ్డుపై నుంచి లారీని మరోచోటకు తరలించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

గుట్టపోచమ్మ భూములు పరిరక్షించాలి

సారంగపూర్: మండలంలోని జామ్, మలక్‌చించోలి గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. జామ్‌లో 165, మలక్‌చించోలి గ్రామంలో 34 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ శ్రీదేవి పేర్కొన్నారు. జామ్ గ్రామంలో పోచమ్మ ఆలయం గుట్ట ప్రాంతంలో కబ్జా చేస్తున్న భూములను పరిరక్షించాలని పలువురు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గుట్టపై పోచమ్మ, వేంకటేశ్వరస్వామి, హనుమాన్ ఆలయాలు ఉన్నాయని.. ఓ రైతు విస్తీర్ణం కన్నా తన భూమి తక్కువ ఉందని ఆలయానికి వెళ్లే మెట్ల ద్వారం వరకు సాగు చేస్తున్నాడని పేర్కొన్నారు. దీంతో ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారని.. సర్వే చేయించి కబ్జాదారుల చెర నుంచి విడిపించాలని కోరారు. గ్రామస్తులు, గ్రామపెద్దలు ఉన్నారు.



సారంగపూర్ : తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం ఇస్తున్న జామ్ గ్రామస్తులు

అడవిసారంగపూర్‌లో ఒక్కటే దరఖాస్తు..

ఖానాపూర్: మండలంలోని అడవి సారంగాపూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఒకే దరఖాస్తు వచ్చినట్లు తహసీల్దార్ సుజాత తెలిపారు. ఆర్‌ఐ సత్యనారాయణ, ఇద్దరు వీఆర్‌ఏలు, పోలీస్ కానిస్టేబుళ్లతో కలిపి నలుగురు సిబ్బంది విధులు నిర్వహించారు. గ్రామంలో పోడు భూముల సమస్యలు ఉన్నాయని గ్రామస్తులు చెప్పినట్లు ఆర్‌ఐ వెల్లడించారు.

ముత్యాల పోచమ్మ ఆలయ ఉత్సవాలు

ఖానాపూర్: పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో ఉన్న ముత్యాల పోచమ్మ ఆలయం వార్షిక ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. భక్తులు ఉత్తరవాహినిగా ప్రవహించే గోదావరి నది వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నది జలాలను కడవల్లో తీసుకొచ్చి అమ్మవారి ప్రతిమకు అభిషేకం చేశారు. రాత్రి బోనాలతో ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మేసు చిన్నరాజన్న, మద్దెల భూమన్న, మగ్గిడి నారాయణ, మేసు గంగేశ్, కుంటాల రాజన్న, జన్నారపు శంకర్, గొర్రె గంగాధర్, దాసరి రాజేశ్వర్, మ్యాదరి రాజేశ్వర్, దండు రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.



నది వద్దకు వెళ్తున్న భక్తులు

విద్యార్థినులు ధైర్యంగా ఉండాలి

కుంటాల: విద్యార్థినులు ధైర్యంగా ఉండి మనకు ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కోవాలని మహిళా కానిస్టేబుళ్లు అశ్విని, అనుప్రియ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కల్లూరు కేజీబీవీలో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా గుడ్‌టచ్–బ్యాడ్‌టచ్, డయల్ 100 గురించి వివరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ సాదిక్, సిబ్బంది ఉన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

ఖానాపూర్: అమ్మమాట..అంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని శివాజీనగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు గోలి పద్మజ, అక్షింత భార్గవి చిన్నారులకు పలకలు అందజేశారు. అంగన్‌వాడీ టీచర్ విజయ, సిబ్బంది ఉన్నారు.

కడెం: మండలంలోని నవబ్‌పేట్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అక్షరాభ్యాసం నిర్వహించారు. సరస్వతిదేవికి పూజలు చేసి చిన్నారులతో ఓనమాలు దిద్దించారు. ఇందులో అంగన్‌వాడీ టీచర్ సత్తవ్వ, సిబ్బంది, పోషకులు ఉన్నారు.



ఖానాపూర్ : పలకలు అందిస్తున్న మహిళలు

అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం



ప్రభుత్వ ఆసుపత్రి వద్ద చెత్తకుప్పలు



హనుమాన్ మందిరం వద్ద..



బజార్‌గల్లీలో..

కుభీర్: మేజర్ గ్రామపంచాయతీ అయిన కుభీర్‌లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ఏప్రిల్, మే మాసాలకు సంబంధించి వేతనాలు రాకపోవడంతో మండలకేంద్రంలో ఉన్న 14 మంది పారిశుద్ధ్య కార్మికులు 15 రోజులుగా విధులకు రావడం లేదు. దీంతో కుళ్లిన కూరగాయల వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు, చెత్తాచెదారంతో వీధులు దర్శనమిస్తున్నాయి. ఆయా కాలనీల పరిసరాల్లో దుర్గంధం వెదజల్లుతుండటంతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అపరిశుభ్రత కారణంగా దోమలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. పంచాయతీ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు వేడుకుంటున్నారు.